సాక్షి
మెదక్
మంగళవారం । 21 । నవంబర్ । 2023



ఎన్నికలు పక్కాగా..

ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు వీలుగా కేంద్ర ఎన్నికల సంఘం అనేక సంస్కరణలు చేపట్టింది.

వివరాలు 2లో ▸



సంక్షేమ పథకాలు

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి, సంక్షేమ పథకాలు సాధ్యమని మెదక్ బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి పేర్కొన్నారు.

వివరాలు 3లో ▸



అపూర్వ స్పందన

ప్రజల నుంచి బీఆర్‌ఎస్‌కు అపూర్వ స్పందన లభిస్తుందని నర్సాపూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి సునీతారెడ్డి అన్నారు.

వివరాలు 3లో ▸





సోమవారం నర్సాపూర్ సభలో ప్రసంగిస్తున్న పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి. చిత్రంలో స్థానిక కాంగ్రెస్ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి... సభకు హాజరైన జనం

పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

మిత్రద్రోహి సీఎం కేసీఆర్

- గిరిజన తండాల అభివృద్ధికి 100 కోట్లు
- కాళేశ్వరం బాధితులకూ పరిహారం
- వెన్నుపోటు పొడిచిన సునీత
- పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

నర్సాపూర్/నర్సాపూర్ రూరల్: తమ ప్రభుత్వం రాగానే పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు, గిరిజన తండాల అభివృద్ధికి వంద కోట్ల రూపాయలు మంజూరు చేస్తామని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. సోమవారం నర్సాపూర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన విజయభేరి సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గం గిరిజనుల అడ్డా, గడ్డ అని అభివర్ణించారు. బీఆర్‌ఎస్ హయాంలో గిరిజన తండాలలో అభివృద్ధి జరగలేదని, అనేక సమస్యలతో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం రాగానే గిరిజనుల పోడు భూములకు పట్టాలు ఇచ్చి, ఇతర పథకాలు అందించి గిరిజనుల అభివృద్ధికి కృషిచేస్తామని ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీకి మోసంచేసి పలువురు నాయకులు పార్టీని వీడి పదవులకు అమ్ముడు పోవడంతో సభ ఎలా ఉంటుందోనని అనుమానంతో వచ్చానని, కాని సభాస్థలిని చూడగానే జనం చీమల మాదిరిగా హాజరవడం చూసి ఆనందించానని చెప్పారు. కార్యకర్తలు కార్యాచరణతో కాంగ్రెస్ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డిని గెలిపించేందుకు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

పేదల గుండె చప్పుడు విఠల్‌రెడ్డి

నర్సాపూర్ నియోజకవర్గం నుంచి సీపీఐ ఎమ్మెల్యేగా దివంగత చిలుముల విఠల్‌రెడ్డి ఐదుసార్లు గెలిచి పేద ప్రజల గుండె చప్పుడై అసెంబ్లీలో గళం వినిపించి నర్సాపూర్ గౌరవాన్ని పెంచారని గుర్తుచేశారు. ప్రస్తుత ఎన్నికలలో సీపీఐతో తమ పార్టీకి పొత్తు ఉందని చెప్పారు. కాంగ్రెస్‌లో పదవులు అనుభవించి ఎన్నికలలో ఓడిపోగానే పార్టీ కార్యకర్తలకు వెన్నుపోటు పొడిచి శత్రువు పంచన చేరడం తగునా అని సునీతారెడ్డిని ప్రశ్నించారు. అలాంటి వారిని ఎలా గెలిపిస్తారని ప్రజలను ప్రశ్నించారు.

కాళేశ్వరం ప్రాజెక్టు బాధితులకు న్యాయం చేస్తాం

తమ పార్టీ అధికారంలోకి వస్తే కాళేశ్వరం ప్రాజెక్టు, త్రిబుల్ ఆర్ రోడ్డు కోసం భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. అంతేకాకుండా బాధితులకు న్యాయం చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

అనంతరం యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో రేవంత్‌రెడ్డిని గజమాల, శాలువాలతో ఘనంగా సన్మానించారు. రామంతాపూర్ సర్పంచ్ గోపి, కొల్చారం మాజీ సర్పంచ్ శేఖర్ తదితరులు రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. సభలో పీసీసీ అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్, సీపీఐ జిల్లా కార్యదర్శి టీఎం కాలేక్, కాంగ్రెస్ నాయకులు ఆంజనేయులుగౌడ్, శేషసాయిరెడ్డి, సుహాసినీరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, సుజాత, లక్ష్మీకాంతారావు, రవీందర్ రెడ్డి, మల్లేశ్, సుధీర్‌రెడ్డి, శ్రీనివాస్‌గుప్తా, చిన్న అంజిగౌడ్, హకీం, రిజ్వాన్, కమల, నరేందర్‌రెడ్డి, పల్లె జయశ్రీ, మణిదీప్, ఉదయ్, రషీద్ పాల్గొన్నారు.

తడబడిన నాయకులు

సభలో పలువురు పార్టీ నాయకులు తమ ప్రసంగాలలో తడబడ్డారు. ఆ పార్టీ నాయకురాలు చిలుముల సుహాసినీరెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పార్టీని విమర్శించి కాంగ్రెస్‌కు ఓటెయ్యాలని ప్రజలను కోరేక్రమంలో 'కారు' గుర్తు అని పొరపాటుగా మాట్లాడి హస్తం గుర్తుకు ఓటెయ్యాలని తిరిగి సరిదిద్దుకున్నారు. అలాగే మరో నాయకుడు సుధీర్‌రెడ్డి కూడా తన ప్రసంగంలో ''18 సంవత్సరాలు అధికారంలో ఉన్న ఈ కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పేందుకు నిరుద్యోగులు సిద్ధంగా ఉన్నారు'' అని తడబడడం గమనార్హం.

కేసీఆర్ మిత్ర ద్రోహి

నర్సాపూర్ ఎమ్మెల్యే చిలుముల మదన్ రెడ్డి సీఎం కేసీఆర్‌ల మధ్య సుమారు 50 ఏళ్ల స్నేహం ఉందన్నారు. కలిసి తిరిగినం, కలిసి తాగినం, కలిసి తిన్నమని వారిద్దరి స్నేహం గురించి కేసీఆర్ చెప్పే వారని, అలాంటి మంచి మిత్రుడు మదన్‌రెడ్డికి పార్టీ టికెట్ ఇవ్వకుండా కేసీఆర్ మోసం చేయడంతో పాటు మిత్ర ద్రోహానికి పాల్పడ్డాడని మండిపడ్డారు.

బీఆర్‌ఎస్‌ను మర్చి పోయేలా చేద్దాం

ఎమ్మెల్యే అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ నాయకులు భూదందాలకు, అవినీతికి పాల్పడడంతో పేదలు చాలా ఇబ్బందుల పాలయ్యారని ఆరోపించారు. నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌ను మర్చి పోయేలా చేద్దామని ఆయన పిలుపునిచ్చారు. దళితులు, గిరిజనుల పోడు భూములకు పట్టాలు ఇచ్చి ఆదుకోవాలని, కాళేశ్వరం, త్రిబుల్ ఆర్ రోడ్డు విషయంలో భూములు కోల్పోయిన వారికి ప్యాకేజీ ఇచ్చి ఆదుకోవాలని ఆయన రేవంత్‌రెడ్డిని కోరారు.

నిరుద్యోగులకు బీఆర్‌ఎస్ ధోకా

మెదక్ జిల్లాను రాజన్నసిరిసిల్ల జోన్‌లో కలిపి జిల్లాలోని నిరుద్యోగులను బీఆర్‌ఎస్ ప్రభుత్వం మోసం చేసిందని ఆవుల రాజిరెడ్డి ఆరోపించారు. జిల్లాను రాజన్న సిరిసిల్లజోన్ నుంచి మార్పుచేసి చార్మినార్ జోన్‌లో కలపాలని ఆయన కోరారు.

న్యూస్‌రీల్

26న ప్రధాని నరేంద్రమోదీ రాక?



స్థలాన్ని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

తూప్రాన్: తూప్రాన్‌లో ఈ నెల 26న నిర్వహించే సభకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ రానున్నారని బీజేపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ మల్లారెడ్డి తెలిపారు. స్థానిక టాటా కాఫీ పరిశ్రమ సమీపంలోని ఖాళీ స్థలాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఆ ప్రాంతం అందరికీ అనువుగా ఉంటుందని భావిస్తున్నామని, అయితే త్వరలోనే అధికారికంగా ప్రకటిస్తారని తెలిపారు. స్థలాన్ని పరిశీలించి హైకమాండ్‌కు తెలియజేస్తామన్నారు. ఆయన వెంట ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాసు, నాయకులు మధుసూదన్‌రెడ్డి, యాదగిరి ఉన్నారు.

రూ.25 లక్షలు పట్టివేత



పట్టుబడిన నగదును చూపుతున్న పోలీసులు


మనోహరాబాద్(తూప్రాన్): ఎన్నికల నిబంధనావళిలో భాగంగా మనోహరాబాద్ మండలం కాళ్ళకల్ వద్ద పోలీసులు, ఎన్నికల సిబ్బంది చేపట్టిన తనిఖీల్లో రూ.25 లక్షలు పట్టుబడ్డాయని ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం సిరిసిల్లా జిల్లా గంభీరావుపేట్ మండల కేంద్రానికి చెందిన కల్వకుంట్ల నరేందర్‌రావు హైదరాబాద్ నుంచి కామారెడ్డికి బస్సులో వెళ్తూ తనవెంట రూ.25 లక్షల నగదును తీసుకెళుతున్నారు. అతని వద్ద నుంచి ఎలాంటి పత్రాలు లేకపోవడంతో పోలీసులు నగదును సీజ్ చేశారు. ఆ డబ్బును గజ్వేల్ ఆర్వోకు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చిరుత దాడిలో లేగదూడ హతం



రామాయంపేట(మెదక్): మండలంలోని ఝాన్సి లింగాపూర్ గ్రామశివారులో చిరుత దాడిచేయడంతో లేగదూడ మృతి చెందింది. గ్రామానికి చెందిన నర్సగల్ల భూదయ్య తన పశువులను అటవీప్రాంతాన్ని ఆనుకుని ఉన్న పంటచేనువద్ద ఉంచుతాడు. ఈక్రమంలో ఆదివారం ఉదయం ఆయన పొలంవద్దకు వెళ్లగా దూడ మృతిచెంది ఉండడాన్ని గమనించాడు. చిరుత తిరిగినట్లు ఆనవాళ్లు ఉన్నాయని బాధిత రైతు పేర్కొన్నాడు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి



పాఠశాలలో విద్యార్థులను ప్రశ్నలడుగుతున్న డీఈఓ రాధాకిషన్

మనోహరాబాద్(తూప్రాన్): విద్యార్థులు, ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, ప్రార్థన సమయం కంటే ముందే పాఠశాలకు హాజరు కావాలని జిల్లా విద్యాధికారి రాధాకిషన్ ఆదేశించారు. సోమవారం మనోహరాబాద్ మండలం కాళ్ళకల్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో పాటు ప్రార్థనలో పాల్గొన్నారు. అనంతరం పలు రికారులను పరిశీలించి, పదో తరగతి విద్యార్థులకు భౌతిక, గణిత శాస్త్రాలలో పలు ప్రశ్నలు అడిగారు. అనంతరం మాట్లాడుతూ ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఆయన వెంట హెచ్‌ఎంలు వెంకటస్వామి, మధుసూదన్‌రెడ్డి తదితరులున్నారు.

మత్స్యకారుల వలలో భారీ కొండచిలువ



వలలో చిక్కిన కొండచిలువ

కొల్చారం(నర్సాపూర్): కొంగోడు గ్రామ శివారు పెద్ద చెరువులో సోమవారం చేపల వేటకు వెళ్ళిన మత్స్యకారులకు వలలో భారీ కొండచిలువ చిక్కింది. అది ఆరున్నర అడుగుల పొడవు, 12 కిలోల బరువు ఉందని మత్స్యకారులు తెలిపారు. అయితే భయపడి దానిని చంపేసినట్లు తెలిసింది.

పట్టుబడిన నగదు తిరిగి చెల్లింపు

జిల్లా ఎన్నికల అధికారి రాజర్షిషా

మెదక్ కలెక్టరేట్: సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఫ్లయింగ్ స్క్వాడ్ టీంల ద్వారా పట్టుబడిన నగదును దరఖాస్తు చేసుకున్న కొంతమందికి తిరిగి చెల్లించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షిషా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెదక్ జిల్లా పరిధిలోని జిల్లా గ్రీవెన్స్ కమిటీ అక్టోబర్ 9 నుంచి ఈ నెల 20 వరకు పోలీస్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ టీంల ద్వారా 65 మంది వద్ద నుంచి మొత్తం రూ.1,60,37,440లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. పట్టుకున్న డబ్బుకోసం 55 మంది నుంచి దరఖాస్తులు రాగా వాటిని జిల్లా గ్రీవెన్స్ కమిటీ అధికారులు పరిశీలించి సంబంధీకులకు రూ.1,41,44,490ల నగదు తిరిగి చెల్లించినట్లు వివరించారు. మిగతా వారుకూడా తగిన ఆధారాలతో దరఖాస్తు చేసుకుంటే జిల్లా గ్రీవెన్స్ కమిటీ పరిశీలించి వెంటనే డబ్బులు తిరిగి చెల్లించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. గ్రీవెన్స్ కమిటీ మెదక్ జిల్లా అధికారులు శ్రీనివాస్ (9281484100), రాకేశ్(9948213828), చిన్న సాయిలు(77999 34150)ను సంప్రదించాలని ఆయన కోరారు.

పరిసరాల పరిశుభ్రతలో రాజీపడొద్దు

డీఎల్‌పీఓ సతీశ్‌కుమార్



వైకుంఠధామాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ

చిన్నశంకరంపేట(మెదక్): పరిసరాల పరిశుభ్రతలో పంచాయతీ సిబ్బంది రాజీపడొద్దని డీఎల్‌పీఓ సతీశ్‌కుమార్ కోరారు. సోమవారం చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని పరిసరాల పరిశుభ్రతతో పాటు డంప్‌యార్డు, వైకుంఠధామాన్ని పరిశీలించి, రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ప్రతిరోజూ శుభ్రం చేయాలని, ప్రతి ఇంటి నుంచీ తప్పనిసరిగా చెత్తను సేకరించాలని సూచించారు. డంప్‌యార్డుకు తరలించిన చెత్తను కంపోస్టు ఎరువుగా మార్చడంతో పాటు ఎవెన్యూ ప్లాంటేషన్‌లోని మొక్కలకు ఎరువుగా వాడాలని కోరారు. వైకుంఠధామం చుట్టూ మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి సంతోశ్‌కుమార్ ఉన్నారు.

గోవును పూజిస్తే సకలదేవతలను పూజించినట్లే

వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి నీల శ్యామ్



గోవుకు పూజలు చేస్తున్న వీహెచ్‌పీ కార్యకర్తలు

చిన్నశంకరంపేట(మెదక్): గోమాతను పూజిస్తే సకలదేవతలను పూజించినట్లేనని విశ్వహిందు పరిషత్ జిల్లా కార్యదర్శి నీలశ్యామ్ అన్నారు. మండలంలోని చందంపేట, రుద్రారం, అగ్రహారం గ్రామాలలో సోమవారం గోమాత పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోవులు విశ్వానికి తల్లిలాంటిదని, ఎన్నో ఉపయోగాలున్న వాటిని మనమంతా రక్షించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మహేశ్, మల్లేశం, మహేందర్, రవీందర్, ప్రశాంత్, విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.



గుండారం ప్రాథమిక పాఠశాలలో ఓటు ఆకారంలో కూర్చున్న విద్యార్థులు

ఓటుపై వినూత్న ప్రదర్శన

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి మండలం గుండారం ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యార్థులు వినూత్న ప్రదర్శన చేశారు. విద్యార్థులకు ఓటు ఆంగ్ల అక్షరాలలో కూర్చోబెట్టి అవగాహన కల్పించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవడమేకాక వినియోగించుకోవాలని ఉపాధ్యాయులు కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామంచ రవీందర్, గిరిబాబు, తిరుపతి, విద్యార్థులు పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీలో పాల్గొన్న అధికారులు

ప్రలోభాలకు గురికావొద్దు

జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి బ్రహ్మాజీ

నర్సాపూర్ రూరల్: ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా ఓటు వేయాలని పట్టణంలో సోమవారం మహిళా శిశు సంక్షేమ శాఖ, స్వీప్, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా శిశు సంక్షేమశాఖ అధికారి బ్రహ్మాజీ మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటుహక్కు వినియోగించుకోవాలని, మద్యం, డబ్బు, ఇతర ప్రలోభాలకు లోనవ్వకుండా, స్వేచ్ఛగా ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ నోడల్ అధికారి రాజిరెడ్డి, సీడీపీఓ హేమాభార్గవి, తదితరులు పాల్గొన్నారు.

సీ విజిల్‌ను సద్వినియోగం చేసుకోవాలి



ప్రజలకు ఓటుహక్కుపై అవగాహన కల్పిస్తున్న సంజయ్‌కుమార్

జిల్లా వ్యయ పరిశీలకుడు సంజయ్‌కుమార్

వవేళిఘణాపూర్(మెదక్): ఓటర్లంగా సీవిజిల్ యాప్‌ను వినియోగించుకోవాలని జిల్లా వ్యయ పరిశీలకుడు సంజయ్‌కుమార్ ప్రజలకు సూచించారు. సాధారణ ఎన్నికల్లో భాగంగా సోమవారం మెదక్ మండలంలోని మక్తభూపతిపూర్, రాజ్‌పేట, వెంకటాపూర్, శివ్వాయిపల్లి. గ్రామంలోని ఓటర్లకు అవగాహన కల్పించారు. ఎవరైనా తమకు ఓటు వేయాలని డబ్బు, మద్యం, ఏవైనా వస్తువులతో ప్రలోభ పెట్టినట్లయితే వెంటనే సీ విజిల్ యాప్‌లో వివరాలు నమోదుచేసి ఫిర్యాదుచేస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఏవైనా సందేహాలుంటే 1950కు తెలపాలని కోరారు. ఓటర్లంతా తప్పకుండా తమ ఓటుహక్కు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో ఎలాంటి ఇబ్బందులు జరుగకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని చెప్పారు. కార్యక్రమంలో లైజన్ అధికారి, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ కృష్ణమూర్తి, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.


నేతలు మారినా.. ఓటరు మారేనా?

- జోరుగా వలసలు.. మారుతున్న జెండాలు
- జంప్‌జిలానీల బలమెంత?
- వారితోపాటు ఓటు బ్యాంకు భద్రమేనా?
- అభ్యర్థులను వెంటాడుతున్న ప్రశ్నలు

మెదక్: శాసనసభ ఎన్నికలు దగ్గరపడుతున్నా ఆయా రాజకీయ పార్టీల్లో నేతల వలసలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నాటి నుంచి ఆయా పార్టీల నుంచి ఇతర పార్టీలకు నేతల వలసలు జోరుగా సాగుతున్నాయి. పార్టీలు మారిన నేతలతో ఓటర్లుకూడా మారుతారా? అనేది సందేహం.

జంప్‌జిలానీల బలమెంత?

అయితే ఈ నేపథ్యంలో జంప్‌జిలానీల బలమెంత? వాళ్లకున్న ఓటు శాతం ఎంత? అనే ప్రశ్నలు అభ్యర్థులను వెంటాడుతున్నాయి. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఎన్నికల షెడ్యూల్‌కన్నా ముందే సిట్టింగ్‌లకు టికెట్లు కేటాయించారు. దీంతో బీఆర్‌ఎస్‌లో టికెట్ ఆశించి భంగపడిన నేతలు కాంగ్రెస్‌లోచేరి టికెట్లు తెచ్చుకోగా కాంగ్రెస్ టికెట్ ఆశించి భంగపడిన ఆశావహులు సైతం బీఆర్‌ఎస్‌లోకి వలసలు వెళ్లారు. అలాగే అధికార పార్టీకి చెందిన ద్వితీయ శ్రేణి నేతలు కాంగ్రెస్‌లో చేరారు. అలాంటి పరిస్థితుల్లో అసలు పార్టీ మారిన వారితోపాటు ఓటర్లు బదిలీ ఏ మేరకు జరుగుతుందన్నది ఇప్పుడు అధినేతల ముందు ప్రశ్న. అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నాటి నుంచి జిల్లాలో రాజకీయ పార్టీల్లో ఒక పార్టీ నుంచి మరో పార్టీలకు జంప్ జిలానీల సంఖ్య అధికసంఖ్యలో పెరిగింది. ఆయా పార్టీల్లో నేతలపై వ్యతిరేకతతో కొందరు, టికెట్ ఆశించి రాకపోవడంతో మరికొందరు ఆయా పార్టీల కండువాలు మార్చేశారు. అయితే, వలస పోతున్న నేతల వెంట ఓటు బదిలీ జరిగేనా అన్న సందిగ్ధత ఆయా పార్టీల అభ్యర్థుల్లో నెలకొంది.



మెదక్‌లో..

మెదక్‌లో బీఆర్‌ఎస్ టికెట్ ఆశించి భంగపడిన మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు బీఆర్‌ఎస్‌కు రాజీనామాచేసి కాంగ్రెస్ నుంచి తన కుమారుడు మైనంపల్లి రోహిత్‌రావుకు, మల్కాజ్‌గిరి నుంచి ఆయన టికెట్లు తెచ్చుకున్నారు. దీంతో మెదక్ కాంగ్రెస్ టికెట్ ఆశించిన మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి, కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, మామిళ్ల ఆంజనేయులు, మ్యాడం బాలకృష్ణ ఒకరి తరువాత ఒకరు సీఎం కేసీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. కాగా బీఆర్‌ఎస్‌లో తమకు ప్రధాన్యత దక్కడం లేదని ద్వితీయ శ్రేణినాయకులు కాంగ్రెస్‌లో చేరారు. పంజావిజయ్ కుమార్ సైతం ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డితో విబేధించి ఆయన బీజేపీలోచేరి టికెట్ తెచ్చుకున్నారు.

నర్సాపూర్‌లో....

నర్సాపూర్‌లో అధికార పార్టీకి చెందిన సిట్టింగ్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డికి కాకుండా సునితాలక్ష్మారెడ్డికి టికెట్ దక్కింది. దీంతో మదన్‌రెడ్డికి మెదక్ ఎంపీ టికెట్ ఇస్తామని ఆ పార్టీ అధినేత కేసీఆర్ బుజ్జగించడంతో మదన్‌రెడ్డి సునితారెడ్డికి మద్దతుగా ప్రచారం చేస్తున్నారు. అలాగే కాంగ్రెస్ టికెట్ రాజిరెడ్డికి దక్కడంతో ఆ టికెట్‌ను ఆశించి భంగపడిన గాలిఅనిల్ వెంటనే అధికార బీఆర్‌ఎస్‌లో చేరారు. దీంతో నర్సాపూర్ నియోజకవర్గంలోని బీఆర్‌ఎస్ ద్వితీయశ్రేణి నాయకులైన వెల్దుర్తి ఎంపీపీ స్వరూప నరేందర్‌రెడ్డి, చిలిపిచెడ్ మాజీ జెడ్పీటీసీ సభ్యుడు, ఆయన తల్లి సుహాసిని రెడ్డి మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన విషయం విధితమే.. వారితోపాటు ఆ నేతల వెంట కింది స్థాయి నాయకులు కూడా కండువాలు మార్చారు.

దొరకని ఓటరు నాడి

ఒకపార్టీ నుంచి మరో పార్టీమారిన నాయకుడి బలం ప్రజల్లో ఏమేరకు ఉంది. ఆ నేత చెబితే ఓట్లు పడతాయా? కండువా మార్చిన నాయకుడికి తన గ్రామం, మండలం, పట్టణం, జిల్లాలో ఏమేరకు పేరుంది? అన్న అనుమానాలు అభ్యర్థుల్లో నెలకొన్నాయి. స్థానిక నేతలు తమ వైపు రావడంతో ఆయా ప్రాంతాల్లో అప్పటి వరకు వారిని నమ్మిన ఓటర్లు ఇప్పుడు వారు మారిన పార్టీకి వేస్తారా? లేదా? అన్న ఆందోళన పలువురు అభ్యర్థుల్లో కన బడుతోంది. ప్రస్తుతం జిల్లాలో బీజేపీ, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు ప్రచారం ముమ్మరం చేశాయి. ఏ పార్టీ మీటింగ్ పెట్టినా జనాలు తండోపతండాలుగా సభలకు వెళుతున్నారు. ఈ పరిస్థితులలో ఓటర్ల నాడి తెలియని పరిస్థితి. ఎవరికి వారు తామే గెలుస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నప్పటికీ ఈ వలస నేతలతో ఓటరు మనవైపు వస్తారా.. అని అభ్యర్థులు మథనపడుతున్నారు.

క్లుప్తంగా

శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

దుబ్బాక: అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా దుబ్బాక మున్సిపల్‌ పరిధిలోని లచ్చపేట మోడల్‌ స్కూల్లో ప్రిసైడింగ్, అదనపు ప్రిసైడింగ్‌ అధికారులకు అందిస్తున్న రెండో విడత శిక్షణ తరగతులను సోమవారం దుబ్బాక ఎన్నికల సాధారణ పరిశీలకులు మన్మోహన్‌ ప్రసాద్, అదనపు కలెక్టర్, దుబ్బాక ఎన్నికల రిటర్నింగ్‌ అధికారి గరీమా అగర్వాల్‌తో కలిసి పరిశీలించారు. 3 రోజుల పాటు ఈ శిక్షణ జరగనుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికలు సజావుగా నిర్వహించాలంటే ఈ శిక్షణ ఎంతో ముఖ్యమైందన్నారు. అధికారులకు ఏ చిన్న సమస్య వచ్చినా పై అధికారులతో చర్చించి పరిష్కరించుకోవాలన్నారు. శిక్షణలో మాస్టర్‌ ట్రైనర్స్‌ భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఈవీఎం మిషన్, బ్యాలెట్‌ యూనిట్, వీవీప్యాట్‌ మిషన్‌లో పేపర్‌ అమర్చే విధానం, కంట్రోల్‌ యూనిట్‌ ఆపరేట్‌ చేసే దశల గురించి, తదితర అంశాల గురించి శిక్షణ ఇస్తున్నారన్నారు. పోస్టల్‌ బ్యాలెట్‌ ఓటు నమోదు గురించి ప్రతీ ఒక్కరికి అవగాహన అవసరమన్నారు. విధుల పట్ల ఎవరైనా అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఈఆర్‌ఓలు వెంకట్‌రెడ్డి తదితరులున్నారు.

దౌల్తాబాద్‌లో నేడు యువగర్జన సభ

పాల్గొననున్న కేటీఆర్‌



హెలీప్యాడ్‌ను పరిశీలిస్తున్న నాయకులు

దౌల్తాబాద్‌(దుబ్బాక): దౌల్తాబాద్‌ మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించనున్న బీఆర్‌ఎస్‌ యువగర్జన సభకు ఆ పార్టీ రాష్ట్ర వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కేటీఆర్‌ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని జెడ్పీ కోఆప్షన్‌ సభ్యుడు రహీమొద్దీన్‌ తెలిపారు. సోమవారం మండలంలోని ఎంజేపీ గురుకుల పాఠశాల వద్ద జరిగే సభ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. మధ్యాహ్నం ఒంటి గంటకు హెలికాప్టర్‌ ద్వారా కేటీఆర్‌ సభా ప్రాంగణానికి చేరుకుంటారన్నారు. ఈ సభకు దుబ్బాక బీఆర్‌ఎస్‌ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి కూడా రానున్నట్లు చెప్పారు. సభ విజయవంతం చేసేందుకు ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు. కార్యక్రమంలో నర్ర రాజేందర్, కలీలొద్దీన్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్‌ ఓటును వినియోగించుకోవాలి



పోస్టల్‌ ఓటు వేస్తున్న ఉద్యోగులు

హుస్నాబాద్‌రూరల్‌: ఈ నెల 30న జరిగే శాసనసభ ఎన్నికల్లో ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకోనేందుకు పోస్టల్‌ ఓటు అవకాశాన్ని కల్పించారు. ఐఓసీ భవనంలోని తహసీల్దారు కార్యాలయంలో సోమవారం పోస్టల్‌ ఓటు వేసేలా ఏర్పాట్లు చేశారు. ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. మంగళవారం కూడా పోస్టల్‌ ఓటు వేసే అవకాశం ఉంటుందని ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఎలక్షన్‌ అధికారులు పేర్కొన్నారు.

దివ్యాంగుల పోలింగ్‌ సరళి పరిశీలన



ఓటింగ్‌ సరళిని పరిశీలిస్తున్న అధికారులు

సిద్దిపేటరూరల్‌: ఎన్నికల కమిషన్‌ మార్గదర్శకాల మేరకు సోమవారం మండల పరిధిలోని పుల్లూరు గ్రామంలో దివ్యాంగుల పోస్టల్‌ బ్యాలెట్‌ ఓటింగ్‌ సరళిని జిల్లా ఎన్నికల పోలీస్‌ అబ్జర్వర్‌ సోనమ్‌ టెన్సింగ్‌ భూటియా, జయశ్రీ భోజ్‌ పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలను ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించడానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో పోలింగ్‌ సిబ్బంది, పోలీస్‌ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు పక్కాగా..

- ఈవీఎంలతో పారదర్శక ఓటింగ్‌
- మొదటి సారి 1982లో కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో వినియోగం


జహీరాబాద్‌: ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు వీలుగా కేంద్ర ఎన్నికల సంఘం అనేక సంస్కరణలు చేపట్టింది. ఇందులో భాగంగా బ్యాలెట్‌ బాక్సులు మొదలు ఈవీఎం(ఎలక్ట్రానిక్‌ ఓటింగ్‌ మెషిన్‌) వరకు ఓటింగ్‌ విధానంలో మార్పులు తెచ్చింది. ఈవీఎం, వీవీప్యాట్, నోటా లాంటి నూతన విధానాలతో పారదర్శక ఓటింగ్‌కు భరోసానిస్తోంది. 1999 ఎన్నికల్లో బ్యాలెట్‌ పత్రాల ముద్రణకు 7,700 టన్నుల కాగితం వాడారు. 2009 సార్వత్రిక ఎన్నికల్లో ఓటింగ్‌ కోసం ఈవీఎం వాడడంతో 10వేల టన్నుల కాగితం మిగిలింది. ఈవీఎంలను మొదటి సారిగా 1982లో కేరళ రాష్ట్రంలోని పర్వూర్‌ అసెంబ్లీ ఎన్నికల్లో ఉపయోగించారు. ఈవీఎంలపై నెలకొన్న సందేహాలకు నివృత్తిగా పలు సమాధానాలను ఎన్నికల సంఘం తన వెబ్‌సైట్‌లో పొందు పర్చింది. నవంబర్‌30న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఈవీఎం విశేషాలపై కథనం.

ఓటు ఎలా వేయవచ్చు?

ఈవీఎం ఓటింగ్‌ విధానంలో కంట్రోల్‌ యూనిట్‌ ప్రిసైడింగ్‌ అధికారి వద్ద, బ్యాలెట్‌ యూనిట్, వీవీప్యాట్‌ ఓటింగ్‌ కంపార్ట్‌మెంట్‌లో ఉంటుంది. బ్యాలెట్‌ యూనిట్‌పై ఓటరు తనకు నచ్చిన అభ్యర్థి గుర్తుకు ఎదురుగా ఉన్న బ్లూ బటన్‌ నొక్కగానే ఎరుపు రంగు లైట్‌ మెరుస్తుంది. ఎంపిక చేసుకున్న అభ్యర్థి సీరియల్‌ నెంబర్, పేరు, గుర్తు చూపించే పేపర్‌ స్లిప్‌ వీవీప్యాట్‌ విండో ద్వారా సుమారు 7 సెకన్ల పాటు కనిపించి డ్రాప్‌బాక్స్‌లో పడగానే కొద్ది సేపు బీప్‌ అనే శబ్దం వస్తుంది. దీంతో ఓటు నమోదైందని తెలుసుకోవచ్చు.

ఈవీఎం మొరాయిస్తే..

పోలింగ్‌ సమయంలో బ్యాలెట్, కంట్రోల్‌ యూనిట్‌ క్రమం తప్పితే బ్యాటల్, కంట్రోల్‌ యూనిట్‌తో పాటు వీవీప్యాట్‌తో కూడిన కొత్త సెట్‌ ఏర్పాటు చేస్తారు. పోలింగ్‌ ఏజెంట్ల సమక్షంలో రిజర్వ్‌ దశ నుంచి పనిచేయని దశ వరకు నమోదైన ఓట్లు, కంట్రోల్‌ యూనిట్, వీవీప్యాట్‌ బ్యాలెట్‌ స్లిప్‌లు కంపార్ట్‌మెంట్‌ మెమొరీలో భద్రంగా ఉంటాయి. వీవీప్యాట్‌ మాత్రమే పనిచేయకపోతే కంట్రోల్‌ యూనిట్‌లో నమోదైన ఓట్లు దాని మెమొరీలో భద్రంగా ఉంటాయి. దీంతో రిజర్వు మెషిన్ల నుంచి పనిచేయని వీవీప్యాట్‌ తొలగించి మరొకటి ఏర్పాటు చేసిన తర్వాత పోలింగ్‌ తిరిగి ప్రారంభిస్తారు. ఏదైనా సాంకేతిక కారణాలతో కంట్రోల్‌ యూనిట్‌లలో నమోదైన ఓట్లను నిర్ధారించకపోతే కంట్రోల్‌ యూనిట్‌ వీవీప్యాట్‌ స్లిప్‌లను లెక్కిస్తారు.



ఈవీఎం అంటే?

ఎలక్ట్రానిక్‌ ఓటింగ్‌ మెషిన్, ఇది ఎన్నికల్లో పోలైన ఓట్లను ఎలక్ట్రానిక్‌ పద్ధతిలో రికార్డు చేయడంతో పాటు లెక్కించే పరికరం. ఈవీఎంలో బ్యాలెట్‌ యూనిట్, కంట్రోల్‌ యూనిట్‌తో పాటు జతగా వీవీప్యాట్‌(ఓటర్‌ వెరిఫైబుల్‌ పేపర్‌ ఆడిట్‌ ట్రయల్‌) ఉంటుంది.

రవాణా సులభం

బ్యాలెట్‌ బాక్సులతో పోలిస్తే ఈవీఎంల రవాణా చాలా సులభం. తేలికగా, పోర్టబుల్‌గా ఉండడంతో దూరంగా, రోడ్డు సౌకర్యం లేని ప్రాంతాలకు సైతం వీటిని సులభంగా తరలించవచ్చు.

గరిష్టంగా అభ్యర్థుల సంఖ్య, వేసే ఓట్లు..

ఈవీఎం బ్యాలెట్‌ యూనిట్‌లో నోటాతో పాటు 15 మంది అభ్యర్థుల పేర్లు మాత్రమే ఉంటాయి. ఒక వేళ అంతకంటే ఎక్కువ అభ్యర్థులు బరిలో ఉంటే మరో బ్యాలెట్‌ యూనిట్‌ను వినియోగించాల్సి ఉంటుంది. ఇలా ఒక ఈవీఎంకు 24 బ్యాలెట్‌ యూనిట్లు అనుసంధానించవచ్చు. తద్వారా 384 మంది అభ్యర్థుల వరకు సేవలు అందిస్తుంది. ఇక ఓట్ల విషయానికి వస్తే గరిష్టంగా 2వేల ఓట్లను రికార్డు చేస్తుంది. కాని ఎన్నికల్లో సాధారణంగా 1500 ఓట్లను నమోదు చేయడానికి మాత్రమే ఉపయోగిస్తున్నారు.

విద్యుత్‌ లేని ప్రాంతాల్లో...

ఈవీఎంలకు విద్యుత్‌ సరఫరా అవసరం లేదు. ఈవీఎం, వీవీప్యాట్‌లకు సొంతంగా బ్యాటరీ/పవర్‌-ప్యాక్‌ సౌకర్యం ఉండడంతో విద్యుత్‌ సరఫరా లేని ప్రాంతాల్లో సైతం వీటిని వినియోగించవచ్చు.

నిర్ధారణ తర్వాతే పోలింగ్‌

పోలింగ్‌ ప్రారంభానికి ముందు కంట్రోల్‌ యూనిట్‌లో రిజల్ట్‌ బటన్‌ నొక్కి ఇప్పటికే 'దాచిన' ఓట్లేవి నమోదు కాలేదని ప్రిసైడింగ్‌ అధికారి హాజరైన పోలింగ్‌ ఏజెంట్లకు ప్రదర్శిస్తారు. వీవీప్యాట్‌ డ్రాప్‌బాక్స్‌ తెరిచి ఖాళీగా ఉందని చూపుతారు. వారి సమక్షంలో కనీసం 50 ఓట్లతో మాక్‌ పోలింగ్‌ నిర్వహిస్తారు. ఆ తర్వాత ఈ ఫలితాన్ని క్లియర్‌ చేసి అసలు పోల్‌ ప్రారంభించే ముందు పోలింగ్‌ ఏజెంట్ల సమక్షంలో కంట్రోల్‌ యూనిట్, వీవీప్యాట్‌కు సీలు వేస్తారు.

పోలైన ఓట్ల సంఖ్య..

ఈవీఎం కంట్రోల్‌ యూనిట్‌ ఫలితం బటన్‌తో పాటు, ఓటర్‌ బటన్‌ ఉంటుంది. పోల్‌ సమయంలో ఎప్పుడైనా ఈ బటన్‌ నొక్కితే అప్పటి వరకు పోలైన మొత్తం ఓట్ల సంఖ్య తెలుస్తుంది. పోలింగ్‌ ముగియగానే క్లోజ్‌ బటన్‌ నొక్కితే మెషిన్‌ ఇకపై ఓట్లను అంగీకరించదు.

ఓటర్లు ఫిర్యాదు చేయవచ్చు

ఓటరు ఓటను నమోదు చేసిన తర్వాత వీవీప్యాట్‌లో కనిపించే పేపర్‌ స్లిప్‌లో ఓటు వేసిన అభ్యర్థి కాకుండా వేరే అభ్యర్థి పేరు, గుర్తు వచ్చినట్లయితే రాత పూర్వకంగా ఫిర్యాదు చేయాలి. నిజమని తేలితే ఆ ఓటింగ్‌ యంత్రంలో తరువాతి ఓట్ల నమోదును నిలిపి వేసి రిటర్నింగ్‌ అధికారి ఇచ్చిన ఆదేశాల ప్రకారం నడుచుకుంటారు.

ఈవీఎంల భద్రత

పోలింగ్‌ తర్వాత ఈవీఎంలను స్ట్రాంగ్‌ రూములో సెక్యూరిటీ బలగాల పహారాలో భద్రపరుస్తారు. ఈవీఎంలు భద్రపర్చిన స్ట్రాంగ్‌ రూమ్‌లకు తాళాలు వేసి ఎన్నికల అధికారులతో పాటు అభ్యర్థులు లేదా వారి ప్రతినిధుల సంతకాలతో సీలు వేస్తారు.

కౌంటింగ్‌ డే..

కౌంటింగ్‌ రోజున అభ్యర్థులు/వారి ప్రతినిధులు, రిటర్నింగ్‌ అధికారి, ఎన్నికల సంఘం పరిశీలకుల సమక్షంలో ఈవీఎంలు భద్రపర్చిన స్ట్రాంగ్‌రూమ్‌ తెరుస్తారు. అభ్యర్థులు, కౌంటింగ్‌ ఏజెంట్ల సమక్షంలో ఓట్ల లెక్కింపు జరుగుతుంది. లెక్కింపు పూర్తయిన తర్వాత వీవీప్యాట్‌ స్లిప్‌లను బయటకు తీసి, అభ్యర్థులు/వారి ప్రతినిధుల సమక్షంలో నల్లటి కవరులో భద్రపరుస్తారు.

ఆయారాం.. గయారాం..

దుబ్బాకటౌన్‌: మంత్రి హరీశ్‌రావు సమక్షంలో ఆదివారం బీఆర్‌ఎస్‌లో చేరిన దుబ్బాక మున్సిపల్‌ పరిధిలోని లచ్చపేటకు చెందిన బీజేపీ సీనియర్‌ నాయకులు అవదూత(పూజ)బాల్‌రాజు, వడ్ల భారత్‌ చారి, అవదూత చందులు తిరిగి సోమవారం ఉదయమే(తెల్లవారక ముందే) ఎమ్మెల్యే రఘునందన్‌రావు సమక్షంలో సొంతగూటికి (బీజేపీలోకి) చేరడం తీవ్ర చర్చానీయాంశంగా మారింది. పొద్దికి ఓ పార్టీ..పొద్దుగల్ల మరోపార్టీ అంటు వీరి తీరుపై సోషల్‌ మీడియాల్‌ లో కామెంట్స్‌ వైరల్‌ అవుతున్నాయి.



హరీశ్‌ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన బాల్‌రాజు, భరత్, చందు



ఎమ్మెల్యే రఘునందన్‌రావు సమక్షంలో బీజేపీ కండువాలతో..

రైతు వ్యతిరేక పార్టీలను తరిమి కొట్టండి



మాట్లాడుతున్న పాకాల శ్రీహరిరావు

రైతు రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పాకాల శ్రీహరిరావు

హుస్నాబాద్‌రూరల్‌: రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను తరిమికొట్టాలని, రైతు సంక్షేమం కోసం భూములను పంచిన కాంగ్రెస్‌ పార్టీకి ఓటు వేసి తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన సోనియా గాంధీ రుణం తీర్చుకోవాలని రైతు రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పాకాల శ్రీహరిరావు అన్నారు. సోమవారం హుస్నాబాద్‌ కాంగ్రెస్‌ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ అభ్యర్థి పొన్నంకు మద్దతుగా రైతు సంఘాలతో సమావేశమై మాట్లాడారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌లు రెండూ రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని ఆరోపించారు. నష్టపోయిన పంటలకు కనీసం పరిహారం ఇవ్వాలనే ఆలోచన రాష్ట్ర ప్రభుత్వానికి లేదన్నారు. రైతు బంధు సాకు చూపించి అనేక సబ్సిడీ రుణాలను ఇవ్వకుండా ఇబ్బందులకు గురిస్తున్నారని చెప్పారు. రైతులను విస్మరించిన కేసీఆర్.. రాష్ట్రాన్ని రూ.5లక్షల కోట్ల అప్పులు పాలు చేశాడని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి జరిగిందని మొరపెట్టినా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. కాళేశ్వరంలోనే నీళ్లు లేవని, ఇక గౌరవెల్లి ప్రాజెక్టుకు ఎలా తెస్తారని ప్రశ్నించారు. పేదల పార్టీ కాంగ్రెస్‌కు ఓటు వేసి ఉద్యమకారుడు పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను గెలుపించుకోంటే రైతులకు లాభం చేకూరుతుందన్నారు. సమావేశంలో రైతు విముక్తి కమిటీ మాజీ సభ్యుడు కవ్వ లక్ష్మారెడ్డి, రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు బాలక్రిష్టారెడ్డి, ముదుగంటి వెంకట్‌రెడ్డి, కొయ్యడ కొమురయ్య, యాదవరెడ్డి, వెన్నరాజు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను మూడోసారి ఆశీర్వదించాలి



ప్రచారం నిర్వహిస్తున్న దేవేందర్‌ రెడ్డి

- రాష్ట్ర కార్మిక సంక్షేమ బోర్డు ఛైర్మన్‌ దేవేందర్‌ రెడ్డి.
- సునీతాలక్ష్మారెడ్డికి మద్దతుగా హత్నూర మండలంలో ప్రచారం

హత్నూర(సంగారెడ్డి): దేశం గర్వించేలా సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన కేసీఆర్‌ను మూడోసారి సీఎంగా గెలిపించాలని రాష్ట్ర కార్మిక సంక్షేమం బోర్డు ఛైర్మన్‌ దేవేందర్‌ రెడ్డి అన్నారు. సోమవారం హత్నూర మండలంలో చింతల్‌ చెరువు, కొత్తగూడెం, నాగారం, కోనంపేట, రెడ్డిపాలెం, గుండ్లమాచునూర్, పల్పనూర్‌ తదితర గ్రామాలలో నర్సాపూర్‌ బీఆర్‌ఎస్‌ అభ్యర్థి సునీతా లక్ష్మారెడ్డికి మద్దతుగా ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేసీఆర్‌ 9ఏళ్ల పాలనలో ప్రతీ గ్రామం అభివృద్ధి చెందిందని గుర్తు చేశారు. రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ఇంటింటికీ నల్లా కనెక్షన్లు అందించారని తెలిపారు. ప్రతి ఒక్కరూ కారు గుర్తుకు ఓటు వేసి సునీత లక్ష్మారెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ఆంజనేయులు, ఎంపీపీ నర్సింలు, ఏసీఎస్‌ ఛైర్మన్‌ దుర్గారెడ్డి, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు శ్రీనివాస్‌ రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు తలారి రాజేందర్, రైతు సమన్వయ సమితి మండల కోఆర్డినేటర్‌ బుచ్చిరెడ్డి, సర్పంచ్‌ సుధాకర్, శౌరెడ్డి, మాధవి రమేష్‌ నాయక్, ఎంపీటీసీ వెంకట్‌ రెడ్డి, రమేష్‌ నాయక్, అర్జున్, వీరేశం గౌడ్‌ శ్రీనివాస్‌ గౌడ్, కిషోర్, రాములు, ఆగమయ్య, శ్రీకాంత్, నరసింహారెడ్డి, శంకర్‌ పాల్గొన్నారు.

ఆదర్శ జీవితానికి రామాయణం మార్గదర్శనం

తెలుగు శాఖ పూర్వ అధ్యక్షులు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి



ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డికి జ్ఞాపికను అందిస్తున్న అధ్యాపకులు

సిద్దిపేట ఎడ్యుకేషన్‌: ప్రపంచంలో ప్రతి ఒక్కరూ ఆదర్శంగా జీవించడానికి రామాయణం మార్గం చూపుతుందని తెలుగు శాఖ పూర్వ అధ్యక్షుడు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. కమనీయం తెలుగు రామాయణం శాంతా వసంత ట్రస్ట్‌ హైదరాబాద్‌ వారి సౌజన్యంతో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో రామాయణం పై రెండు రోజుల జాతీయ సదస్సు సోమవారం ప్రారంభించారు. తెలుగు విభాగాధిపతి డాక్టర్‌ మహేందర్‌ అధ్యక్షతన జరిగిన ప్రారంభ సమావేశంలో ముఖ్య అతిథిగా కసిరెడ్డి వెంకటరెడ్డి పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న అరాచకాలను అరికట్టడానికి బాల్యం నుంచే రామాయణం ద్వారా మానవీయ విలువలను నేర్పాల్సిన అవసరం ఉందన్నారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న ఉస్మానియా విశ్వవిద్యాలయ ఆచార్యులు సూర్య ధనుంజయ మాట్లాడుతూ రామాయణంలోని ఆశ్రమాలు, ఆదర్శ దాంపత్యం, సంస్కృతి సంప్రదాయాలు వంటివి ఎన్నో నేర్చుకోవచ్చని తెలిపారు. ఆత్మీయ అతిథులుగా డాక్టర్‌ గోపాల సుదర్శన్‌ పాల్గొన్నారు. అనంతరం మొదటి సాంకేతిక సదస్సుకు అధ్యక్షత వహించిన కాకునూరి సూర్యానారాయణ మూర్తి భారతంలో రామ కథను ప్రస్తావించారు. ఈ సదస్సులో తెలంగాణ విశ్వవిద్యాలయ ఆచార్యులు ఆచార్య కరిమిండ్ల లావణ్య రంగనాథ రామాయణం వృత్తాంతాలు, మెదక్‌ కళాశాల తెలుగు సహాయాచార్యులు వామన మూర్తి రామాయణం ఆదర్శ జీవనం, లక్సెట్టిపేట తెలుగు సహాయాచార్యులు తన్నీరు సురేష్‌ సీతాకల్యాణం అంశాలపై పత్ర సమర్పణ చేశారు. సమావేశంలో జనగామ తెలుగు సహాయాచార్యులు పప్పుల శైలజ కథలలో రామాయణం, కరీంనగర్‌ తెలుగు సహాయాచార్యులు మట్ట సంపత్‌ కుమార్‌రెడ్డి రామ కథలలో తెలంగాణ జన తాత్వికతతో పాటు వివిధ కళాశాలల తెలుగు సహాయాచార్యులు, పరిశోధక విద్యార్థులు తెలుగు రామాయణాలకు సంబంధించిన అంశాలపై పరిశోధన పత్రాలు సమర్పణ చేశారు. ఈ సదస్సులో తెలంగాణ విశ్వవిద్యాలయం తెలుగు సహాయాచార్యులు డాక్టర్‌ లక్ష్మణ చక్రవర్తి, అధ్యాపకులు, సాహితీ అభిమానులు పాల్గొన్నారు.



పంట పొలాల్లో ప్రచారం

అక్కన్నపేట(హుస్నాబాద్‌): కాంగ్రెస్‌ అభ్యర్థి, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు మద్దతుగా ఆ పార్టీ గిరిజన నాయకులు సోమవారం పలు గ్రామాల్లో ముమ్మర ప్రచారం చేశారు. పత్తి చేనుల్లో పనిచేస్తున్న మహిళల వద్దకు వెళ్లి చెయ్యి గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారికి ఆరు గ్యారంటీల గురించి వివరించారు. కార్యక్రమంలో ధరావత్‌ తిరుపతి నాయక్, భానోతు భాస్కర్‌నాయక్, గుగులోతు అర్జున్, గుగులోతు రాజు పాల్గొన్నారు.

పెన్షన్‌లు కాదు.. నౌకర్లు కావాలి

- పేదల పక్షాన పోరాడుతున్నా.. ఆశీర్వదించండి
- దుబ్బాక బీజేపీ అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావు



చెట్లనర్సంపల్లి ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న మాధవనేని రఘునందన్‌రావు

దుబ్బాకటౌన్‌: చదువుకున్న బిడ్డలకు నౌకర్లు కావాలే గాని.. పెన్షన్లు కాదని .. ఇంట్లో పిల్లలకు కొలువులు వస్తే పెన్షన్లకు ఆశపడే అవసరం ఎందుకు ఉంటుందో తల్లిదండ్రులు ఆలోచించాలని దుబ్బాక బీజేపీ అభ్యర్థి, ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు కోరారు. సోమవారం నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన వారికి పార్టీ కండువాలు కప్పారు. అలాగే దౌల్తాబాద్, తొగుట మండలాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రఘునందన్‌రావు మాట్లాడారు. ఎంతో కష్టపడి ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు రాక యువత తీవ్ర నిరాశలో ఉన్నా కేసీఆర్‌ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. 10 ఏళ్లుగా ఎంత మందికి ఉద్యోగాలిచ్చిందో ప్రజలు ఆలోచించాలన్నారు. ఉద్యోగాలు వస్తే కుటుంబాలు ఆర్థికంగా బాగుపడుతాయి తప్పా ప్రభుత్వాలు ఇచ్చే స్వార్థపూరిత కానుకలతో కాదన్నారు. నిరుద్యోగులు కేసీఆర్‌ ప్రభుత్వాన్ని తప్పకుండా సాగనంపుతారన్నారు.

కేసీఆర్‌ మాటలు నమ్మి మోసపోవద్దు

రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు కేసీఆర్‌ కల్లబొల్లి మాటలు, కథలు చెబుతున్నాడని.. వాటిని ప్రజలు నమ్మి మళ్లీ మోసపోవద్దని రఘునందన్‌రావు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బీజేపీ అధికారంలోకి వస్తుందని.. అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. బీజేపీ ప్రవేశపెట్టిన మేనిఫెస్టోతో రైతులు, నిరుద్యోగులు, అన్ని వర్గాలకు ప్రజలకు మేలు జరుగుతుందన్నారు.

మరోసారి ఆశీర్వదించండి

పేదలు, నిరుద్యోగులు, ఉద్యోగ, కార్మిక, కర్షక వర్గాల తరఫున పోరాడుతున్న తనను మరోసారి ఆశీర్వదించి గెలిపించాలని రఘునందన్‌రావు కోరారు. నిరుద్యోగులు, అంగన్‌వాడీలు, వీఆర్‌ఏ, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులకు న్యాయపరంగా దక్కాల్సిన హక్కుల కోసం అనేక పోరాటాల్లో పాల్గొన్నానని, వారితో కలిసి ధర్నాలు, ఆందోళనలు ప్రత్యక్షంగా చేసినట్లు చెప్పారు. అసెంబ్లీలో సైతం పేదలు, నిరుద్యోగులతో పాటు చాలా సమస్యలపై గళం ఎత్తి ప్రభుత్వాన్ని నిలదీశానన్నారు. ప్రశ్నించే గొంతుకను.. కమలం పువ్వు గుర్తుకు ఓట్లేసి మళ్లీ అసెంబ్లీకి పంపిస్తే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేస్తానన్నారు.



మాచిన్‌పల్లిలో భారీగా తరలివచ్చిన ప్రజలు



రుక్మాపూర్‌లో ఇంటింటి ప్రచారం..

దుబ్బాక అభివృద్ధి కోసమే నా తపన..

'దుబ్బాక నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలన్నదే నా తపన, ఆవేదన, ఆకాంక్ష' అని రఘునందన్‌రావు అన్నారు. నియోజకవర్గానికి జరుగుతున్న అన్యాయాన్ని ఎదురొడ్డి న్యాయపరంగా దక్కాల్సిన నిధులు వచ్చేలా పోరాడుతున్న విషయం ప్రజలకు తెలిసిందేనన్నారు. తాను గెలిచిన 3 ఏళ్లలో నియోజకవర్గంలో ఎంతో మార్పు వచ్చిందో.. అభివృద్ధి ఎలా పరుగెత్తింతో గమనించి మళ్లీ గెలిపించాలని కోరారు. ఈ సారి దుబ్బాకను రాష్ట్రంలోనే నంబర్‌వన్‌గా తీర్చిదిద్దుతానన్నారు.

బీఆర్‌ఎస్‌కు అవకాశం ఇస్తే ఆగమవుతాం

దౌల్తాబాద్‌/తొగుట: దుబ్బాక ప్రజలు బీఆర్‌ఎస్‌కు ఓట్లు వేసి ఆగం కావద్దని మాధవనేని రఘునందన్‌రావు కోరారు. సోమవారం మాచిన్‌పల్లి, చెట్లనర్సంపల్లి, అప్పాయిపల్లి గ్రామాలతో పాటు తొగుట మండలంలోని వర్ధరాజుపల్లి, కాన్గల్, గుడికందుల గ్రామాల్లో రఘునందన్‌రావు ఎన్నికల ప్రచారం చేపట్టారు. అవినీతి, అక్రమాలకు కేరాఫ్‌గా మారిన బీఆర్‌ఎస్‌ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే వృథా అవుతుందన్నారు.

ఇంటింటి ప్రచారం

చేగుంట(తూప్రాన్‌): చేగుంటతో పాటు రుక్మాపూర్‌ గ్రామంలో బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావుకు మద్దతుగా ఉపసర్పంచ్‌ రాంచంద్రం సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మ్యాకల రమేష్, బాలరాజు, నవీన్, స్వామి, ముత్యం, సిద్దిరాములు, శ్రీరాం సిద్దిరాంలు, గణేష్, లావణ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న వైస్‌ ప్రిన్సిపాల్‌ శ్రీనివాస్‌

సిద్దిపేట ఎడ్యుకేషన్‌: గ్రంథాలయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్‌ ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ వాసం శ్రీనివాస్‌ అన్నారు. సోమవారం డిగ్రీ కళాశాల (అటానమస్‌), సిద్దిపేటలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశలో రోజూ గ్రంథాలయానికి వెళ్లి గ్రంథ పఠనం చేయాలని సూచించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్‌ డాక్టర్‌ ఆవులపాటి వేణు, సీనియర్‌ అధ్యాపకులు డాక్టర్‌ మధుసూదన్‌, డాక్టర్‌ శ్రద్దానంద, డాక్టర్‌ రాణి, కృష్ణయ్య, సిబ్బంది వెంకటలక్ష్మి, రమ్య, నరసింహా, జరీనా పాల్గొన్నారు.

'సీపీఎంను గెలిపించండి'

మద్దూరు(హుస్నాబాద్‌): నిత్యం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడే సీపీఎంను గెలిపించాలని ఆపార్టీ అభ్యర్థి మోకు కనకారెడ్డి అన్నారు. సోమవారం దూల్మిట్ట మండల కేంద్రంతో పాటు జాలపల్లి, తోర్నాల, బెక్కల్‌ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వ రంగాన్ని కార్పొరేట్‌ శక్తులకు అప్పగించి ప్రభుత్వ రంగాన్ని ధ్వంసం చేసిందని విమర్శించారు. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు శశిధర్‌, జిల్లా కమిటీ సభ్యులు చొప్పరి రవికుమార్‌, ఆలేటి యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

సంఘం సభ్యులను ఆదుకుంటాం

నంగునూరు(సిద్దిపేట): పొదుపు సంఘం సభ్యుడు మరణిస్తే బీమా ద్వారా బాధిత కుటుంబాన్ని ఆదుకొని అండగా నిలుస్తున్నామని పురుషుల పొదుపు సంఘం మండల అధ్యక్షుడు కడారి తిరుపతిరెడ్డి అన్నారు. రాజగోపాల్‌పేటలో ఇటీవల మరణించిన మంగళి బాలకిషన్‌ కుటుంబ సభ్యులకు సోమవారం అభయనిధి, సామూహిక నిధి కింద రూ. 57 వేలు అందజేశారు. మహేశ్‌, నాగరాజు, మల్లేశం, రాజు, చంద్రమౌళి, రాములు, నర్సింలు, కనకయ్య, అశోక్‌ పాల్గొన్నారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని దేవక్కపల్లె, గాగిల్లాపూర్‌, కల్లెపెల్లి, వడ్లూరు గ్రామాల్లో సోమవారం బీజేపీ మానకొండూర్‌ అభ్యర్థి ఆరెపల్లి మోహన్‌ ప్రచారం నిర్వహించారు. బీజేపీ మేనిఫెస్టోలోని పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఆపార్టీ కిసాన్‌ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కరివేద మహిపాల్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు, ఎంపీటీసీ కొలిపాక రాజు, శ్రీధర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

'పొన్నం' మాటలు నమ్మొద్దు

కోహెడ(హుస్నాబాద్‌): హుస్నాబాద్‌ కాంగ్రెస్‌ అసెంబ్లీ పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ మాటలను నమ్మొద్దని భీమదేవరపల్లి జెడ్పీటీసీ సభ్యుడు వంగ రవీందర్‌గౌడ్‌ అన్నారు. సోమవారం బీఆర్‌ఎస్‌ కార్యాలయంలో మాట్లాడారు. కరీంనగర్‌ ఎంపీగా ఉన్నప్పుడు పొన్నం నియోజకవర్గానికి, గౌడ కులస్తులకు చేసింది ఏమిలేదన్నారు. మాయమాటలతో మరోసారి గౌడ కులస్తులను మభ్యపెడుతున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు రాజేశ్వరి, రవీందర్‌, శ్రీనివాస్‌, పర్శరాములు, రాజేశం, వీరన్న, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కుటుంబ పాలనకు స్వస్తి పలకాలి

కొండపాక(గజ్వేల్‌): కుటుంబ పాలనకు స్వస్తి పలకాలని మండల పార్టీ అధ్యక్షుడు, సర్పంచ్‌ వాసరి లింగారావు కోరారు. మండల పరిధిలోని రవీంద్రనగర్‌, అంకిరెడ్డిపల్లి, రాంపల్లి గ్రామాల్లో సోమవారం కాంగ్రెస్‌కు మద్దతుగా ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండండి

తాండూరు టౌన్‌: ఎన్నికల విధులు నిర్వహించే పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ కోటిరెడ్డి ఆదేశించారు. సోమవారం తాండూరు డీఎస్పీ కార్యాలయ ఆవరణలో డివిజన్‌ పరిధిలోని పోలీసు సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటర్లు ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. సున్నిత, అతి సున్నితమైన గ్రామాల్లో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి, ఎప్పటికప్పుడు సీసీ కెమెరాల్లో పర్యవేక్షించాలన్నారు.

ఆమె చేతిలోనే గెలుపోటములు



ఒడితల సతీష్‌కుమార్‌
బీఆర్‌ఎస్‌



పొన్నం ప్రభాకర్‌ గౌడ్‌
కాంగ్రెస్‌



బొమ్మ శ్రీరాంచక్రవర్తి
బీజేపీ

- 'స్వశక్తి మహిళలకే విజేతను నిర్ణయించే శక్తి
- హుస్నాబాద్‌లో ఆ సంఘం మహిళా ఓటర్లే అధికం
- ఎవరిని ఆశీర్వదిస్తారో..?

హుస్నాబాద్‌రూరల్‌: హుస్నాబాద్‌ నియోజకవర్గం మెట్ట ప్రాంతం. ఒకప్పుడు కరువు కాటకాలతో రైతు కూలీలు కరువు కష్టాలను ఎదుర్కొని పుట్టిన ఊరిలో పనులు లేక పొట్ట కూటి కోసం ముల్లె మూట సర్దుకుని వలస వెళ్లి జీవించేవారు. కరువు ప్రాంతంలో దొరలు, భూస్వాముల వ్యవస్థలతో అణగారిన పేద ప్రజలు పేదరికంలో కూరుకుపోయారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేక ఉద్యమాలకు జీవం పోసిన నేల, 13 మంది అమర వీరులను ఒడిలో చేర్చుకున్న మహ్మదాపూర్‌ వీర భూమి, సర్వాయి పాపన్న ఉద్యమానికి స్థావరమైన కోటగిరి గట్టుకు పురుడు పోసిన ఉద్యమాల ఖిల్లా, పీపుల్స్‌వార్‌ (మావోయిస్టు) ఉద్యమాలకు ప్రాణం పోసి పోరు బిడ్డలను అందించిన మాతృమూర్తులు ఎంతోమంది ఉన్నారు. హుస్నాబాద్‌ ఉద్యమ నేల నీళ్లు తాగిన ప్రతి ఒకరికీ ఎదురు నిలబడి ప్రశ్నించే శక్తి ఉంటుంది. మావోయిస్టు నాయకులను అందించిన వీర వనితలకే ప్రజాస్వామ్య వ్యవస్థలో నాయకులను గెలిపించే అవకాశం వచ్చింది. హుస్నాబాద్‌ నియోజకవర్గంలో 2,42,177 ఓటర్లకు పురుషులు 1,19,757, మహిళలు 1,22,416 మంది, ఇతరులు నలుగురు ఓటర్లు ఉన్నారు. ఇందులో మహిళా ఓటర్లు అధికంగా ఉండగా.. అందులో 6,926 స్వశక్తి మహిళా సంఘాల్లో 74వేల మంది సభ్యులు ఉండటం విశేషం. వీరు ఎవరికి ఓటు వేస్తే ఆ పార్టీ నాయకుడు గెలిచే అవకాశం ఉంది.

ఇందుర్తిలో ప్రతిపక్షం, హుస్నాబాద్‌లో అధికార పక్షం..

హుస్నాబాద్‌ నియోజకవర్గంలో 15 సార్లు ఎన్నికలు జరిగితే నాలుగు సార్లు మినహా ఎప్పుడూ ప్రతిపక్షం అభ్యర్థులే గెలుపొందారు. ప్రతిపక్షం అభ్యర్థులు గెలుపొందడం వల్ల హుస్నాబాద్‌ ప్రాంతం అభివృద్ధిలో వెనుకబడి పోయింది. హుస్నాబాద్‌ నియోజకవర్గం ఏర్పడిన తర్వాత మూడు సార్లు అధికార పార్టీ అభ్యర్థులు గెలుపొందడం.. వారు అభివృద్ధికి ఎక్కువ నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేయడం జరుగుతుంది. ఆనాటి కరువు ప్రాంతం ఇప్పుడు సాగునీరు ఉండటంతో ఇతర రాష్ట్రాల ప్రజలకు ఉపాధి కల్పించే ప్రాంతంగా నిలబడి అభివృద్ధి వైపు అడుగులు వేస్తుంది. 2009లో నియోజకవర్గాల పునర్విభజనలో హుస్నాబాద్‌, చిగురుమామిడి, కోహెడ, సైదాపూర్‌, భీమదేవరపల్లి, ఎల్కతుర్తి ఆరు మండలాలతో హుస్నాబాద్‌ నియోజకవర్గం ఏర్పడింది. ఇక్కడి నుంచి అధికార పార్టీ అభ్యర్థులు గెలవడం ఆనవాయితీగా వస్తుంది.

కొత్తవారిని ఆశీర్వదించే స్వశక్తి మహిళలు

నియోజకవర్గాల పునర్విభజనలో హుస్నాబాద్‌గా ఏర్పడిన నియోజకవర్గంలో రాజకీయ ప్రవేశం చేసిన కొత్తవారికి ఇక్కడి ఓటర్లు అవకాశం ఇస్తున్నారు. హుస్నాబాద్‌లో గెలిచిన పార్టీనే అధికారంలోకి రావడంతో హుస్నాబాద్‌ నుంచే కేసీఆర్‌ ఎన్నికల ప్రచారం ప్రారంభించడం నాయకుల్లో చర్చనీయాంశంగా మారింది. 2009 తొలి సారి కాంగ్రెస్‌ పార్టీ నుంచి అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి టికెట్‌ తెచ్చుకుని టీఆర్‌ఎస్‌ పై విజయం సాధించగా.. కాంగ్రెస్‌ అధికారంలోకి వచ్చింది. 2014లో టీఆర్‌ఎస్‌ అభ్యర్థి వొడితల సతీశ్‌కుమార్‌ తొలిసారి పోటీ చేసి గెలుపొందగా.. రాష్ట్రంలో ఆ పార్టీయే అధికారంలోకి వచ్చింది. 2018లో రెండోసారి సతీశ్‌కుమార్‌నే ప్రజలు భారీ మెజార్టీతో గెలిపించారు. మూడో సారి అదృష్టంను పరీక్షించుకుంటున్నారు. హుస్నాబాద్‌ నియోజకవర్గం ఏర్పడిన తర్వాత కొత్త నాయకులను విజేతలుగా నిలపడంలో స్వశక్తి సంఘాల మహిళల ఓట్లు కీలకంగా మారుతున్నాయి. వారి ఓట్లను పొందినవారే విజేతలు నిలుస్తున్నారు. ఇప్పుడు కూడా స్వశక్తి మహిళల 80వేల ఓట్లు గెలుపును నిర్ణయించనున్నాయి. మహిళ సంఘాల సభ్యులు ఐక్యతగా ఉండటం.. ఒకరికి మాట ఇస్తే మాట తప్పకుండా ఓటు వేసే నిజాయితీపరులుగా ఉండటంతో నాయకులు సైతం మహిళ సంఘాల ఓట్లను రాబట్టుకునేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు. పార్టీ ఇచ్చే మేనిఫెస్టోల అంశాల ఆకర్షణతో పాటు నాయకుడి గుణగణాలను కూడ మహిళా సంఘాల సభ్యులు పరిగణనలోకి తీసుకుని ఓటు ఎవరికి వేయాలనే నిర్ణయం తీసుకుంటున్నారు.



హుస్నాబాద్‌ నియోజకవర్గం ముఖ చిత్రం

హుస్నాబాద్‌ నియోజకవర్గ ఓటర్లు,స్వశక్తి సంఘాలు,సభ్యులు

మండలం	ఓటర్లు	స్త్రీలు	పురుషులు	సంఘాలు	సభ్యులు
హుస్నాబాద్‌	35339	17939	17398	993	10,522
కోహెడ	36,229	18,194	18,034	1052	10,905
అక్కన్నపేట	32,356	16,131	16,225	936	10,005
భీమదేవరపల్లి	41,475	21,028	20,447	1054	12,771
ఎల్కతుర్తి	31,726	116,116	15,610	937	10,446
చిగురుమామిడి	33,175	16,767	16,407	990	10,265
సైదపూర్‌	31,877	16,241	15,636	858	9,197
మొత్తం	2,42,173	1,22,416	1,19,757	6,926	74,171



సమావేశంలో స్వశక్తి మహిళలు

మూడో అవకాశం ఎవరికి..?

నియోజకవర్గం ఏర్పడిన తర్వాత తొలిసారి కాంగ్రెస్‌కు అవకాశం ఇచ్చిన ఓటర్లు, రెండు సార్లు టీఆర్‌ఎస్‌కు అవకాశం ఇచ్చారు. మూడో సారి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ (కాంగ్రెస్‌), ఒడితల సతీశ్‌ కుమార్‌ (బీఆర్‌ఎస్‌), బొమ్మ శ్రీరాంచక్రవర్తి (బీజేపీ) పార్టీల నుంచి బరిలో ఉన్నారు. ఒకరు మాజీ ఎంపీ, మరొకరు మాజీ ఎమ్మెల్యే కుమారుడు, ఒకరు సిట్టింగ్‌ ఎమ్మెల్యే కావడంతో వీరిలో మహిళలు ఎవరికి అవకాశం ఇస్తారో వేచి చూడాలి. బ్యాంకులు రూ.20 లక్షల బ్యాంక్‌ లింకేజీ ఇస్తున్న మహిళలకు కుటీర పరిశ్రమల ఏర్పాటు, యువతులకు ఉపాధి కల్పన కేంద్రాలను డివిజన్‌ కేంద్రంలో ఏర్పాటు చేయాలనే డిమాండ్‌ ఉంది.

రేపు కురుమల ఆత్మీయ సమ్మేళనం

దుబ్బాకరూరల్‌: అక్బర్‌పేట– భూంపల్లి మండలం నగరం గ్రామ శివారులో ఉన్న రామలింగేశ్వర ఫంక్షన్‌హాల్‌లో ఈనెల 22 నియోజకవర్గ స్థాయి కురుమల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్టు జిల్లా అధ్యక్షుడు కోరె ఎల్లయ్య, మండల అధ్యక్షుడు చిర్ర తిరుపతి ఒక ప్రకటనలో తెలిపారు.

'సిద్దిపేటలో బీఎస్పీ జెండా ఎగురవేస్తాం'

నంగునూరు(సిద్దిపేట): సిద్దిపేటలో బీఎస్పీ జెండా ఎగురవేయడం ఖాయమని ఆ పార్టీ సిద్దిపేట అభ్యర్థి చక్రధర్‌గౌడ్‌ అన్నారు. సోమవారం రాంపూర్‌, మగ్దుంపూర్‌, అప్పలాయిచెర్వు, పాలమాకుల, ముండ్రాయి గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గ ప్రజలు మార్పు కోరుతున్నారని.. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో చారిత్రాత్మక తీర్పు ఇవ్వడం ఖాయమని పేర్కొన్నారు.

సబ్బండ వర్గాల అభ్యున్నతే లక్ష్యం

కొండపాక(గజ్వేల్‌): సబ్బండవర్గాల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని జాగృతి రాష్ట్ర కార్యదర్శి అనంతుల ప్రశాంత్‌ పేర్కొన్నారు. మండల పరిధిలోని సిర్సనగండ్ల, కొండపాక గ్రామాల్లో మండల పార్టీ అధ్యక్షుడు నూనె కుమార్‌ ఆధ్వర్యంలో సోమవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు చిట్టి మాధురీరెడ్డి, ర్యాగల్ల దుర్గయ్య, భూపతిరెడ్డి, రాధాకిషన్‌రెడ్డి, దొమ్మట మహిపాల్‌రెడ్డి, రాజగిరి శ్రీనివాస్‌, సుదర్శన్‌రెడ్డి, మల్లికార్జున్‌, రాముల యాదగిరి, రమేష్‌, గోపాల్‌రెడ్డి, అనిల్‌కుమార్‌, నర్సాగౌడ్‌, ఉపేందర్‌, శ్రీనివాస్‌రెడ్డి, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

మల్లన్నకు ముడుపు



పాదయాత్రగా వస్తున్న యువకులు

కొమురవెల్లి(సిద్దిపేట): పల్లా రాజేశ్వర్‌రెడ్డి విజయం సాధించాలని, సీఎం కేసీఆర్‌ మూడోసారి ముఖ్యమంత్రి కావాలని బచ్చన్నపేట మండలంలోని తమ్మడపల్లి యువకులు సోమవారం పాదయాత్రగా వచ్చారు. కొమురవెల్లి మల్లన్న ఆలయంలోని గంగిరేణి చెట్టుకు ముడుపులు కట్టారు. అనంతరం స్వామివారికి పూజలు నిర్వహించారు.

బీఆర్‌ఎస్‌ ప్రజల ప్రభుత్వం



చింతమడకలో మాట్లాడుతున్న రవీందర్‌ రెడ్డి

సుడా చైర్మన్‌ రవీందర్‌ రెడ్డి

సిద్దిపేటరూరల్‌: చింతమడక ముద్దుబిడ్డ సీఎం కేసీఆర్‌ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో నేడు ప్రజల ప్రభుత్వంగా మారిందని సుడా చైర్మన్‌ రవీందర్‌ రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని సీఎం గ్రామం చింతమడక, ఇర్కోడ్‌ గ్రామాల్లో హరీశ్‌రావుకు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలతో ప్రజల్లో సంతోషం, అభివృద్ధి కార్యక్రమాలతో గ్రామాలు ఆదర్శంగా మారాయన్నారు. దేశంలో ఎక్కడా లేని పథకాలు మన రాష్ట్రంలోనే అమలవుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీదేవీ చందర్‌ రావు, జెడ్పీటీసీ శ్రీహరి గౌడ్‌, వైస్‌ ఎంపీపీ యాదయ్య, పార్టీ మండల అధ్యక్షుడు యాదయ్య, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

జిల్లాలో 660 మంది హోమ్‌ ఓటర్లు

జిల్లా ఎన్నికల అధికారి రాజర్షిషా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్‌ రాజర్షిషా

మెదక్‌ కలెక్టరేట్‌: జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో 660 మంది హోమ్‌ ఓటర్లు ఉన్నట్లు జిల్లా ఎన్నికల అధికారి రాజర్షిషా తెలిపారు. సోమవారం రాత్రి జిల్లాలోని మెదక్‌, నర్సాపూర్‌ నియోజకవర్గాల ఆర్‌ఓలు, నోడల్‌ అధికారులతో కలెక్టర్‌ తన ఛాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదక్‌ జిల్లాలో ఎన్నికలు నిర్వహిస్తున్న అధికారులకు, ఇతర నియోజకవర్గాల నుంచి వచ్చి ఎన్నికల విధులలో నిమగ్నం అయిన అధికారులకు, పోలింగ్‌ కేంద్రాలు, పోలింగ్‌ తేదీలను తెలిపారు. జిల్లాలో మొత్తం 660 మంది హోమ్‌ ఓటర్లు ఉన్నారని, వారు ఓటు హక్కు వినియోగించుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అలాగే మెదక్‌ నియోజకవర్గంలో 1192, నర్సాపూర్‌ నియోజకవర్గంలో 1072 మంది ఎన్నికల విధులు నిర్వహించే పీఓలు, ఏపీఓలు ఈనెల 22, 24, 25లలో ఓటుహక్కు వినియోగించుకోవాలని తెలిపారు. వారికి మెదక్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, నర్సాపూర్‌లో ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో పోలింగ్‌ కేంద్రం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పోలీసు, సెక్టోరియల్‌ అధికారులకు ఈ నెల 23, 24, 25 తేదీలలో మెదక్‌లో ఎన్నికల విధులు నిర్వర్తించే వారు మెదక్‌ ఆర్డీఓ కార్యాలయంలోను, నర్సాపూర్‌ నియోజక వర్గంలో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న వారు నర్సాపూర్‌ ఆర్డీఓ కార్యాలయంలో తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని తెలిపారు. ఇతర నియోజక వర్గం నుంచి వచ్చినవారు ఐడీఓసీలో ఏర్పాటు చేసిన పోలింగ్‌ కేంద్రంలో ఈనెల 23, 24, 25 తేదీలలో ఓటు హక్కు వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌ వెంకటేశ్వర్లు, ఆర్వోలు అంబాదాసు రాజేశ్వర్‌, శ్రీనివాస్‌, నోడల్‌ అధికారులు పాల్గొన్నారు.

జిల్లా జడ్జికి సన్మానం



నూతన జడ్జిని సన్మానిస్తున్న న్యాయవాదులు

సంగారెడ్డి టౌన్‌: నూతన జిల్లా జడ్జి ప్రభాకర్‌ రావును ఘనంగా సన్మానించారు. సోమవారం కోర్టు ఆవరణలో బార్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించింది. కార్యక్రమంలో బార్‌ అసోసియేషన్‌ జిల్లా అధ్యక్షుడు విష్ణువర్ధన్‌ రెడ్డి, సభ్యులు మోహన్‌, కృష్ణ, బాలరాజు, మాణిక్‌ రెడ్డి, రామ్‌ రెడ్డి శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

కాస్త విభిన్నంగా..

నర్సాపూర్‌: నర్సాపూర్‌ బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్యే అభ్యర్థి సునీతారెడ్డిపై ఉన్న అభిమానాన్ని ఓ కార్యకర్త తన కాస్త విభిన్నంగా చాటుకున్నాడు. స్థానిక యువకుడు రాయుడుసాయి బీఆర్‌ఎస్‌ అభ్యర్థి సునీతారెడ్డికి వీరాభిమాని. దీంతో అతడు వీఎస్‌ఎల్‌ఆర్‌ (వాకిటి సునీతాలక్ష్మారెడ్డి) అనే ఇంగ్లీషు అక్షరాలు వచ్చే విధంగా హెయిర్‌ కట్‌ చేయించుకుని తన అభిమానాన్ని చాటుకున్నాడు. తనకు సునీతారెడ్డి అంటే చాలా అభిమానమని చెప్పాడు.



వీఎస్‌ఎల్‌ఆర్‌ అక్షరాలు కనిపించేటట్టు హెయిర్‌కట్‌ చేయించుకున్న యువకుడు

సభలు.. యమ కాస్ట్లీ గురూ..

- ఒక్కో మీటింగ్‌కు రూ.2 కోట్ల వరకు ఖర్చు
- అన్ని పార్టీలదీ అదే బాట
- మందు, విందు, రవాణా, డబ్బు ఇవ్వాల్సిందే
- కొన్ని సార్లు ఖర్చు చేసినా రాని జనం
- ముఖ్యనేతలు వస్తే ఖర్చులు మరింత పెరిగే అవకాశం



ఇటీవల జిల్లాలో నిర్వహించిన బీఆర్‌ఎస్‌ రోడ్‌షోకు హాజరైన జనం

వికారాబాద్‌: ఎన్నికల సభలు, సమావేశాలు ఇప్పుడు బాగా కాస్ట్లీ అయ్యాయి. ఒకప్పుడు తమ ప్రాంతానికి అభిమాన నాయకులు, నేతలు వస్తే చూడటానికి, అతను చెప్పే మాటలు వినేందుకు ప్రజలు స్వచ్ఛందంగా తరలి వెళ్లేవారు. ఎవరూ పిలవకుండానే సొంత డబ్బు పెట్టుకొని సభలు, సమావేశాలకు ఎగబడేవారు. సమావేశాలకు హాజరయ్యే జనాన్ని బట్టి ఆ పార్టీ, ఆ నేత బలాబలాలు అంచనా వేసేవారు. ప్రజల నుంచి వచ్చే స్పందనే గెలు పోటములను నిర్ణయించేవి కూడా. ఇదంతా గతం.. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. అభిమాన నేతల స్పీచ్‌లు వినాలనుకుంటే ఇప్పుడు సమావేశాలకు వెళ్లాల్సిన అవసరం లేదు. చేతిలో సెల్‌ఫోన్‌, ఇంట్లో టీవీ ఉంటేచాలు సమావేశం మొత్తం ప్రత్యక్షంగా చూడొచ్చు. దీంతో ప్రజలు సభలు, సమావేశాలకు వెళ్లడం చాలావరకు తగ్గించారు. దీంతో డబ్బులు ఖర్చు చేసి జన సమీకరణ చేయడం పార్టీలు, అభ్యర్థులకు తప్పనిసరిగా మారింది.

ఎంత ఖర్చు చేస్తే అంత సక్సెస్‌

నేడు సభలు, సమావేశాల నిర్వహించడం మారుతున్న పరిస్థితికి అద్దం పడుతోంది. మీటింగులు ఎంత సక్సెస్‌ అయ్యాయనేది ఆ సభలకు ఖర్చు చేసిన డబ్బులపైనే ఆధారపడుతోంది. జిల్లాలో ఇటీవల జరిగిన సభలు, సమావేశాలు, రోడ్‌ షోలకు ఒక్కో దానికి రూ. 1.5 కోట్ల నుంచి రూ. 3 కోట్ల వరకు ఖర్చు చేసినట్టు తెలుస్తోంది. పార్టీ ఏదైనా ఒక వ్యక్తి సమావేశానికి రావాలంటే అతని చేతి ఖర్చులకు రూ. 300 నుంచి రూ. 500 వరకు ఇవ్వాల్సిందే. కొన్ని సందర్భాల్లో డబ్బు తోపాటు రవాణా ఖర్చులు, మద్యం, భోజనం కూడా ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. సగటున ఒక వ్యక్తిని సమావేశానికి తీసుకురావడానికి రూ. 500 ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఓవరాల్‌గా పదివేల మందితో సమావేశం నిర్వహిస్తే రూ. కోటి నుంచి కోటిన్నర వరకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఇటీవల కొన్ని సభలు, రోడ్‌ షోలకు 20 వేల మంది వరకు జనాలను తరలించారు. ఈ లెక్కన ఒక్కో సభకు రూ. రెండు నుంచి రూ. మూడు కోట్లు ఖర్చు చేసినట్టు ఆయా పార్టీల నేతలే చెబుతున్నారు. కొన్ని చోట్ల 30 నుంచి 40 వేల జనాలను సమీకరించేందుకు ప్లాన్‌ చేస్తే 10 నుంచి 20 వేల మంది కూడా రావడం లేదు. జిల్లాలో ఇటీవల జరిగిన ఓ రోడ్‌ షోలో 30 వేల మందిని తరలించేందుకు ఆ పార్టీ ఖర్చు చేస్తే కేవలం 10వేల లోపే హాజరు కావడంపై ఆ పార్టీలో చర్చనీయాంశం అయ్యింది.

స్పీచ్‌లతో ప్రభావితం చేయాలనే..

రేవంత్‌రెడ్డి, కేటీఆర్‌, హరీశ్‌రావు, కేసీఆర్‌, రాహుల్‌, సోనియా వీరందరినీ కొత్తగా పరిచయం చేయాల్సిన అవసరంలేని నేతలు.. వీరి హోదాలు,పార్టీలతో సంబంధం లేకుండా వీరి పేరు చెబితే చాలు 90శాతం జనం గుర్తుపడతారు. అయితే వీరిని తీసుకువచ్చి సమావేశాలు నిర్వహించడం, వీరితో మాట్లాడించడం నేడు రాజకీయాల్లో ట్రెండ్‌గా మా రింది. వీరితో మాట్లాడిస్తే వారి స్పీచ్‌లతో జనం ప్ర భావితం అవుతారని, అభ్యర్థుల గెలుపోటములను కూడా వారి స్పీచ్‌లు నిర్ణయిస్తా యని నమ్ముతున్నారు.దీంతో సభలు, సమావేశాలు ఏర్పాటు చేసి ఈ స్టార్‌ క్యాంపెయినర్లను తీసుకొ చ్చేందుకు అధికార, ప్రతిపక్ష పార్టీల అభ్య ర్థులు పోటీ పడుతున్నారు. ఇందులో భాగంగానే ఇప్పటికే జిల్లాలో కాంగ్రెస్‌ తరఫున రేవంత్‌రెడ్డి, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌, బీఆర్‌ఎస్‌ తరఫున మంత్రులు కేటీఆర్‌, హరీశ్‌ రావు, ఎంఐఎం అధినేత అసదుద్దీన్‌ ఓవైసీ లాంటి నేతలు ఇప్పటికే జిల్లాలో పర్యటించారు. ఇక రాహుల్‌గాంధీ, కేసీఆర్‌ల రాకకోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

చికిత్స పొందుతూ ఇద్దరి మృతి

రాయపోలు(దుబ్బాక): మద్యం మత్తులో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన మండలంలోని ఆరెపల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై రఘుపతి తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన కొత్తింటి స్వామి (38) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. కాగా ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. రోజూ మద్యం సేవిస్తుండడంతో ఆరోగ్యం కూడా దెబ్బతింది. కాగా ఈనెల 18న మద్యం సేవించిన స్వామి.. అదే మత్తులో వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి పురుగుల మందు తాగాడు. విషయాన్ని భార్య శోభారాణికి ఫోన్‌ చేసి చెప్పాడు. వెంటనే ఆమె ఇతరుల సాయంతో అక్కడికి వెళ్లి స్వామిని గజ్వేల్‌ ప్రభుత్వాసుపత్రికి తరలించింది. అక్కడ పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్‌ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు.

పోతారెడ్డిపేటలో..

దుబ్బాకరూరల్‌: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన అక్బర్‌పేట– భూంపల్లి పోలీస్‌స్టేషన్‌ పరిధి పోతారెడ్డిపేటలో జరిగింది. ఎస్‌ఐ భువనేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దప్పు నర్సయ్య (68) ఆదివారం సాయంత్రం హోటల్‌లో టీ తాగడానికి వెళ్లాడు. తిరిగి ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా చల్మెడ వైపు బైక్‌పై అతివేగంగా వచ్చిన వ్యక్తి నర్సయ్యను ఢీకొట్టాడు. దీంతో తలకు తీవ్ర గాయాలు కావడంతో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో గాంధీ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతిడి కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.